కథానిక

# వెలిగి ఆరిన మిస్. కృష్ణ

మొవ్వ రాంబాబు

కాథలిక్ మిషన్ వారి టి, బి. శానిటోరియమ్ వాతావరణం ప్రశాంతంగాను నిర్మలంగాను ఉన్నది. అది ఎత్తయిన కొండప్రాంతంలో ఉండటం చేతనూ చుట్టూ వివిధాకృతుల్లో పెరిగిన చెట్ల శోభతోను అనేకములయిన అడవి పక్షుల శ్రావ్యమయిన కంఠధ్వనులతోనూ ఆదర్శవంతమయిన శానిటోరియంగా, ప్రశాంతతకు చిహ్నంగా ఉన్నది. శానిటోరియంలోని మేడ మీది తన ప్రత్యేక గదిలో కూర్చుని ఆలోచిస్తూ ఉన్నది క్రిష్ణకుమారి తన గత జీవితాన్ని గురించి అనంతమయిన ప్రకృతిలోనికి చూస్తూ. డాక్టరు వాసుదేవరావు అప్పుడే తన రెండవ రౌండు రోగులని చూడటానికి వస్తూన్నాడు.

"మిస్ క్రిష్ణ!"

"కూర్చోండి"

సాయంత్రం అతను రోగులను చూడటానికి వచ్చినప్పుడు అందరినీ ముందుగా చూచి వచ్చి మిగతా టైము ఆమెతో ముచ్చటిస్తూ కూర్చుంటాడు. వారిద్దరూ అంత పరిచయమవటం చాలా ఆశ్చర్యపడ వలసిన విషయం. డాక్టరు వాసు రోజూ ఆమెవద్ద ఒకటి రెండు గంటల కాలం గడుపుతాడు ఆమెతో. ఇది యింత ప్రత్యేకంగా ఎందుకు చెప్పవలసిందంటే డాక్టరు వాసుకు టైము ఉండదు. శానిటోరియమ్‌లోని ప్రతి ఒక రోగికి అతనంటే మహా యిష్టం. రోగులను వాసు రోగులుగా చూడడు. రోగుల మొఖాలు వాటిభంగములు, వాటియొక్క మార్పులు, వారి కంఠధ్వనులు, రోగుల మనస్తత్వాలు అతడు బాగా అవగాహన చేసుకుంటాడు. మిగతా డాక్టర్లకి అతనికీ ఇదే తేడా. జబ్బుని పట్టి మిగతా డాక్టర్లు రోగి స్వభావాన్ని నిర్ణయించటానికి ప్రయత్నిస్తారు. కాని వాసు వారి రోగాలను పట్టికాకుండా వారి మనస్తత్వాలను పట్టి వారి హావభావ చేష్టలను పట్టి వారితో మెలుగుతూ ఉంటాడు. వాసు ఎప్పుడూ చిరునవ్వుతో ప్రతి వారినీ నవ్విస్తూ వారివారి తత్వాలకు సరిపడేటట్లు సంచరించేవాడు. మిస్ క్రిష్ణకుమారి జబ్బు చాలా సీరియస్ అయినప్పటికి, కానప్పటికీ హాస్పిటల్‌లోని మిగతా డాక్టర్లకి ఆమె విషయం ఏదీపట్టదు. ఆమె గత జీవితం ఎంత ఆశ్చర్యకరమైనదో, ఆమె ఎంతమంది హృదయాలలో ఆనందజ్యోతులు వెలిగించినదో ఎంత మంది మనస్సులను గిలిగింతలు పెట్టి ఉఱ్ఱూతలూగించినదో ఆ డాక్టర్లకి పట్టదు.

మిస్ క్రిష్ణ ఇంకా తన ఆలోచనలలోనుంచి తేరుకోలేదు. "ప్రపంచంలో తనకు అందరూ ఉన్నారు. తన సౌఖ్యాన్ని సదా కోరే భర్త యింకా జీవించే ఉన్నాడు. (వారిద్దరూ పెండ్లి చేసుకోకపోయినా ప్రపంచ దృష్టిలో వారిద్దరూ భార్యాభర్తలుగా కొన్నాళ్ళు వ్యవహరింపబడ్డారు.) ప్రాణస్నేహితుడయినటువంటి రమణమూర్తి యింకా సజీవంగానే కులాసాగానే ఉన్నాడు. తాను ఎంత అవినీతితో (పాపము నశించుగాక!) ప్రవర్తించినా తనను యింకా చిన్నపిల్లగాను పసిపిల్లగాను చూచుకునే తల్లితండ్రులు, ఇంకా ఎంతో మంది ఉన్నారు. కాని ఈ నిమిషాన ఎవ్వరూ లేరు. తను అందరికీ కావలసినా తనకు ఎవ్వరూ అక్కరలేదు. ఇక్కడ జీవితం ప్రశాంతంగా ఉన్నది. తను మళ్ళీ నగరంలోనికి జబ్బు నయమయిపోతేమన సారా అసహ్యించుకొన్నటువంటి జీవితాన్ని మరల మొదలు పెట్టవలసి వస్తుంది. మళ్ళా గానసభలు, నాట్యప్రదర్శనాలు, ఖులాసాగా కబుర్లు వచ్చిన గొప్పగొప్ప వారివద్ద ఛాన్సు చిక్కినప్పుడల్లా డబ్బు, కీర్తి, సంపద మొదలయినవన్నీ కాజేయటం, తను అందుకు ప్రక్రియగా తనకు ఇష్టం లేకపోయినా వాళ్ళను సంతోష పెట్టాలనటం ఇవి ఆన్నీ ఆమె అసహ్యించుకుంటుంది. వాళ్ళునవ్వే ప్రతి నవ్వు

లోనూ, వాళ్లు మాచే ప్రతి చూపులోనూ ఎన్ని విషపు కోరికలున్నాయి!"

"నేను వెళ్ళిపోతున్నాను!" అన్నాడు వాసు.

ఆమె ఒక్కసారి అతనివంక చూచింది.

"కూర్చోండి బాబుగారు. అప్పుడే వెళ్ళిపోతారేమిటి" అని అన్నది.

"అయితే విశేషాలేమిటండి" అని మళ్ళా అడిగింది.

"నేనేమీ ఆలిండియా రేడియోను కాదు వార్తలు విశేషాలు చెప్పటానికి" అన్నాడు వాసు నవ్వుతూ.

"ఐనా బాగుండేది ప్రజోపయోగార్థం!" అన్నది ఆమె కూడా పేలవంగా నవ్వుతూ. చివరిమాట అర్థం అతను గ్రహించగలిగాడు.

"నీకు ఒంట్లో ఎట్లా ఉన్నది"

"మీకు తెలియందేముంది"

"నాకు తెలుసుగాని నువ్వు యెట్లా ఫీల్ అవుతున్నావో నాకు అర్థం కావటంలేదు" అన్నాడు డాక్టరు వాసు.

"నేను చనిపోతే బాగుండును" ఆమె అన్నది నేలవంక చూస్తూ.

"అట్లా అంటావేమిటి?" అని అన్నాడు.

"అనటం ఏముంది డాక్టరు బాబు! నేను మనస్ఫూర్తిగానే అంటున్నాను. మానవులు యెక్కువకాలం బ్రతకాలనుకోవటం బహు మూర్ఖం. జీవితం అంటే ఏమిటో తెలియక ప్రొద్దున లేచింది మొదలు రాత్రి విశ్రమించబోయేదాక ఒకేపని చేస్తూ, గానుగ ఎద్దులాగా జీవితాన్ని గడుపుతూ, జీవించడంలో ఏవిధమయిన ఉత్సాహమూ, గొప్ప ఆశలు, కోర్కెలు లేకుండా జీవించేవాళ్లు భయపడుతుంటారు. పరిపూర్ణులయిన ఆర్టిస్టులందరూ ఏ విషయానికి భయపడరు. సంతోషమయినా దుఃఖమైనా వాళ్ళకు ఒక్కటే. వాళ్లు జీవితాన్ని జీవితంగా అనుభవిస్తారుగాని ప్రతి విషయానికీ వెలితిచెందరు. నా గడచిన జీవితాన్ని ఆలోచించుకొని మిక్కిలి సంతోషిస్తుంటాను, ఎంత మనోహరమయినదా అని. కాని నాది ఒక్క కోరిక పూర్తికాలేదు బాబుగారు" అని అన్నది.

"ఏమిటిది?"

"ఈ విధంగా క్షయతో చావటం మిక్కిలి దారుణం. నేను యెప్పుడో ఒకప్పుడు యెవరో ఒకరిచేతిలో అకాలంగా చంపబడా లనుకునేదాన్ని గాని ఈ విధంగా జబ్బు



'డిక్టేటరు' చిత్రంలో ఒక సన్నివేశం

-లతో తీసుకు చావటం చాలా దారుణం" అని అన్నది.

"అది అంతా భగవదేచ్ఛ" అని అన్నాడు. అతనికి భగవంతుడంటే ఏనాడూ నమ్మకంలేదు.

"నాన్‌సెన్స్, మీరు భగవంతుని తలవటం చాలా గమ్మత్తుగా ఉన్నది" అని అన్నది.

"నాకు నీ జీవితచరిత్ర వింటుంటే భగవత్ ప్రార్థన చేయాలనిపిస్తుంది శ్రీమతీ" అని అన్నాడు. (ఆమెను శ్రీమతీ అనికూడా అతడు ముచ్చటగా పిలుస్తుంటాడు.)

"అదే నేను మీకుచెప్పేది! ఇతరులకొరకని నమ్మకంలేనివాటిని అవలంబించబోకండి."

అతడు నవ్వుకుంటూ తలఊపి లేచాడు వెళ్ళటానికి.

ఈవిధమయిన సంభాషణలతో వారిద్దరి పరిచయం గాఢమైన స్నేహితంగా మారిపోయింది.

ఒకరోజు సాయంత్రం సూర్యాస్తమయ సమయానికి ఒకగంట ముందుగా డాక్టరు వాసు తన కార్యక్రమం పూర్తిచేసుకొని ఆమెదగ్గరికివచ్చాడు. నర్సు ఆమెను అప్పుడే కుర్చీమీద కూర్చొనపెట్టి పైన దుప్పటి కప్పింది. డాక్టరు వాసు నెమ్మదిగా కుర్చీనితోసుకుంటూ గార్డెను లోనికి తీసుకువచ్చి తనూ ఒక కుర్చీమీద కూర్చున్నాడు. ఆమె మనిషి క్షీణించిపోతున్నా శరీరకాంతి తగ్గలేదు, ఆమె ముఖము, ముఖ్యంగా ఆమెకళ్లు మెరసిపోతూనే ఉన్నవి. ఆమెకళ్లు చూడటానికి వాసు ఎంతో ఇష్టపడతాడు.

చెదరిపోయిన దుప్పటి కప్పుతూ "ఇవాళ మీవారి దగ్గరనుంచి ఒక వుత్తరం వచ్చింది" అని అన్నాడు.

"ఏమని వ్రాశాడో చదివి చెప్పండి" అన్నది దూరంగా చూస్తూ.

"ఏముంది? అంతా మామూలే. నిన్ను ఒక్కసారి చూడాలనిపిస్తున్నదట. నీకు ఏ విధంగా ఉన్నదీ, సీరియస్‌గా ఉంటే తక్షణం తెలియచేయవలసిందిగా కోరుతూ ప్రేమతో ముగించాడు" అని అన్నాడు వాసు.

"ఇప్పట్లో వారు యిక్కడకు రావలసిన పని ఏమీలేదని, ఇప్పుడు చాలా కులాసాగానే ఉన్నాననీ, తొందరలోనే నయమవుతుందనీ



'బహార్' హిందీచిత్రంలో వైజయంతీమాల

ఒక ఉత్తరం టైపు కొట్టి ఇవ్వండి. నేను సంతకం చేసి ఇస్తాను." అని అన్నది ఆమె.

"అతను అడిగినదానికి అన్నీ అబద్ధాలే వ్రాయమంటున్నావు." అని అన్నాడు వాసు.

"పైగా ఈపాపకార్యంలో ఉత్తరం టైపు చేసినందుకు నాకూ భాగం ఉంటుందని, అనవసరంగా ఒక పెద్దమనిషికి అబద్ధాలు వ్రాయటం నాకు ఇష్టంలేని పని అని గుర్తించుకోవాలి" అని అన్నాడు మళ్ళా.

ఆమె నవ్వుతూ "మీ పూర్వీకులు చేసుకున్న పుణ్యం చాలాఉన్నదిలెండి. ఒక ఉత్తరం టైపు చేసిపెట్టినంత మాత్రాన నరకానికిపోరు. పైగా నాకు లేని చింత మీకు కలగటం చాలా అసహజం" అని అన్నది.

డాక్టరు కొంచెంసేపు ఆలోచించిఅన్నాడు:

"నీవు నీ భర్తను చూడటానికి భయపడుతున్నావల్లే ఉన్నది. వారియొక్క ముఖాన్ని చూడటానికి నీ సెన్‌డ్ కాన్‌షస్ ఒప్పుకోక పోవటం సహజ మనుకుంటాను."

ఆమె మనస్సును నొప్పించాలనే అతడు అన్నాడు.

ఆమె ముఖం ఎర్రబారింది. బుగ్గలు చిగురించినట్లయినవి.

"డాక్టరు బాబూ! మీకు యెన్నో మాట్లు చెప్పాను, నేను జరిగిపోయినదానికి ఏమాత్రం దుఃఖించనని, జీవితాన్ని రెండుచేతులతో తీసుకొని దానితో ఆడాను, నాటకంలో ఒక పాత్రధారివలె. గడచిపోయిందాన్ని గురించి ఎన్నడూ ఆలోచించకూడదనుకుంటానుగాని మానవస్వభావం అతీతమయింది. గడచిపోయిన మధురస్మృతులు, సుఖదుఃఖాలు అన్నీ తలంపుకు వస్తూ మనస్సును ఒక అవ్యక్తమయిన ఆనందంలోనికి తీసుకువెళ్ళతవి" అని ఆమె చెప్పి మళ్ళా "ఇంతకీ నేను మీరు అడిగిన ప్రశ్నకు అసలు సమాధానం చెప్పలేదు. నా భర్తను నేను యెందుకు చూడదలుచుకోలేదంటె అతనికి నేనంటే అమితప్రేమ కనుక" అని ముగించింది.

డాక్టరు బాబు తెల్లపోయాడు. అతడు ఏదో చెప్పబోతుండగానే 'మీరు మాట్లాడనవసరం లేదు. దానిమీద నేను ఇంక చెప్పలేను. కాని జీవితంలో మీరు ఎప్పుడయినా ఎవరినయినా అధికంగా ప్రేమించేరు, జాగ్రత్త డాక్టరు బాబూ!" అని అన్నది.

సూర్యుడు అస్తమించాడు. సింధూరం వన్నెగల సూర్యాస్తమయకాంతులు కొండల వెనుక ప్రకాశిస్తూనే ఉన్నవి. కాని అప్పుడే చలిగాలి వీయటం మొదలు పెట్టింది. డాక్టరు వాసు ఒక నర్సుని పిలవంగానే ఆమె క్రిష్ణను కుర్చీలో కూర్చో పెట్టి గదిలోకి తీసుకునచ్చింది.

ఈ విధంగా వారాలు, రోజులు గడచిపోతూనే ఉన్నవి. ఆమె క్షీణించిపోతూనే ఉన్నది. జబ్బు నయమయ్యే సూచనలు కనుపించటం లేదు.

ఇద్దరూ ఒకరోజు బయట పూలతోటలో కూర్చున్నారు.

"డాక్టరు బాబూ! మీరు ఎందుకు పెళ్ళి చేసుకోరు?"

డాక్టరు నోట మాటరాలేదు. ఆమె మళ్ళీ అందుకొని "మీకు పెళ్ళి చేసుకోవాలని ఎన్నడూ అనిపించలేదా?" అని అడిగింది.

"ఎప్పుడయినా ఒంటరిగా ఒకటి రెండు రోజులు గడిపితే పెళ్ళి చేసుకోవాలనిపిస్తుంది. కాని యిక్కడకు వచ్చి ఈ మనుష్యులని, రోగులని చూస్తే నన్ను నేను మరిచిపోతాను." అన్నాడు.

"అది నాకు తెలుస్తూనే ఉన్నది కాని మీరు ఎవరి కొరకు ఈ రోగులమీద అంత హ్యూమానిటేరియన్ గా ఉంటారు" అతడు మాట్లాడలేదు. అతడు నెమ్మదిగా:

"నీకు జబ్బు నయమయితే నిన్ను పెళ్ళిచేసుకుంటాను. అప్పుడు అన్నీ సరిపోతవి" అని అన్నాడు.

"అప్పుడు స్వేచ్ఛావిహారి అయిన ఒకఅడవిపక్షిని పంజరంలో పెట్టినట్లవుతుంది డాక్టరు బాబూ! పైగా నన్ను పెళ్ళి చేసుకోవటానికి ఇంక నేను ఉండనుగా. నేను మీకు ఎన్నో సార్లుగా చెప్పుతున్నాను. ఈవిధంగా జబ్బుతో తీసుకుచావటం చాలా ఘోరమని. దాదాపు సంవత్సరన్నర నుండి నన్ను బంధించివేసినట్లు చేసింది ఈ జబ్బు. నేను మా నగరంలోని జనాన్ని ఎంత అసహ్యించుకున్నా మీ శానిటోరియంలోని ప్రశాంతతను ఎంత మెచ్చుకున్నా ఇంక జీవించటం అనవసరం. అందుకని ఇవాళ ..." ఆమె స్వరం స్పృహ తప్పింది.

డాక్టరు వాసు గబాలున లేచి కుర్చీలోనుంచి ఒరిగి పడిపోబోయే ఆమెను పట్టుకున్నాడు.

"డాక్టరుబాబు! జీవితంలో మార్పు జరుగుతుండాలి. మార్పులేనిది జీవితమే లేదు. జీవితాన్ని అనుభవించండి డాక్టరూ" అంటూ కుర్చీలో ఒరిగిపోయింది.

డాక్టరు నిశ్చేష్టుడయ్యాడు. కొద్ది క్షణాల వరకూ ఏమీ తోచలేదు. దుప్పటి సాంతం ఆమె ముఖంమీదికె కప్పి, తను యెంత నాస్తికుడైనా గబాలున మోకాళ్ళమీద మోకరిల్లి అన్నాడు. "భగవంతుడా ఆమె ఆత్మకు శాంతినివ్వు."

---

డబ్బుతో ఏ పనైనా సాధించవచ్చునని నమ్మేవాళ్లు సాధారణంగా డబ్బుకోసం ఏ పని చెయ్యడానికైనా సిద్ధమయేవాళ్లయి ఉంటారు.—హాలిఫాక్సు.